నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 15 జూలై 2024 | KARIMNAGAR

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను సన్మానిస్తున్న మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు

నగరాభివృద్ధికి నిధులు తీసుకువస్తా

- ప్రణాళికలు రూపొందించండి
- మంత్రి పొన్నం, ఎమ్మెల్యే గంగులతో చర్చిస్తా
- అందరినీ కలుపుకొని ముందుకు పోతా
- కౌన్సిల్ మీటింగ్‌కు వచ్చే ప్రయత్నం చేస్తా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ కార్పొరేషన్/ విద్యానగర్, జూలై 14 : కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నిధులు తీసుకువచ్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నగరాల అభివృద్ధి కోసం రూపొందించే వివిధ పథకాల్లో కరీంనగర్‌ను చేర్చేలా చూస్తానన్నారు. కార్పొరేటర్ నుంచి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగిన సందర్భంగా ఆయనను మేయర్ వై సునీల్‌రావు, పాలక వర్గ సభ్యులు ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో గజమాలతో సన్మానించి, నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. పాలకవర్గ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు ప్రజా సమస్యలపై మాట్లాడాలని, ప్రచారం కోసం విమర్శలు, గొడవలు మానుకోవాలని సూచించారు. వచ్చే కౌన్సిల్ సమావేశంలో తాను కూడా పాల్గొనేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. నగరాభివృద్ధి కోసం పాలకవర్గం ఒక మంచి ప్రణాళికతో ముందుకు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నగరాల అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా ఉంటుందని, దీని కోసం మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను కూడా కలిసి చర్చిస్తానని తెలిపారు. అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని పోతానని చెప్పారు. తనకు భవిష్యత్తును ఇచ్చిన నగరాభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. స్మార్ట్‌సిటీకి సంబంధించి మిగిలిన నిధులు వేగంగా విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు అబ్బాస్ షమీ, గుగ్గిళ్లపు రమేశ్, పాలకవర్గ సభ్యులు నేతి కుంట యాదయ్య, అఖిల్, మహేశ్, బండారి వేణు, తోట రాములు, గందె మాధవి, సుధ గోని మాధవి కృష్ణగౌడ్, చొప్పరి జయశ్రీ, రాపర్తి విజయ పాల్గొన్నారు.

ఎన్సీఈఆర్టీ పరీక్షలో మెరిసిన మనోజ్

రాష్ట్రస్థాయిలో సెకండ్ ర్యాంక్

బడే మనోజ్

జగిత్యాల/జగిత్యాల రూరల్ జూలై 14: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఆర్ఐఈ పరీక్షలో జగిత్యాల విద్యార్థి సత్తా చాటాడు. ఓపెన్ కేటగిరీలో బడే మనోజ్ రాష్ట్రస్థాయిలో సెకండ్, ఓబీసీ విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. జగిత్యాలలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన మనోజ్ స్థానిక జ్యోతి హైస్కూల్‌లో పదో తరగతి చదివాడు. బాసర ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకొని పన్నెండో తరగతి పూర్తిచేశాడు. విద్యాబోధనపై ఆసక్తితో ఎన్సీఈఆర్టీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఆర్ఐఈ జాతీయస్థాయిలో మైసూర్‌లో నిర్వహించిన పోటీ పరీక్షకు హాజరయ్యాడు. ఇందులో మన రీజినల్ (కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, పాండిచ్చేరి, లక్ష దీవ్‌పే)లో తెలంగాణలోని ఏడు సీట్లకు ఓపెన్ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించాడు. ఈ ఘనత పొందిన మనోజ్‌ను స్కూల్ టీచర్లు, యాజమానులు అభినందించారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

హామీలు నెరవేర్చేదాకా ప్రశ్నిస్తాం

- 'రామగుండం రచ్చబండ' పెట్టి సమస్యలు తెలుసుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జూలై 14: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటామని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తేల్చిచెప్పారు. ప్రజాసమస్యలను తెలుసుకొనేందుకు త్వరలోనే 'రామగుండం రచ్చబండ' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఆదివారం గోదావరిఖనిలోని బీఆర్ఎస్ ఆఫీస్‌లో నిర్వహించిన ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు గడిచినా గ్యారెంటీల అమల్లో నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. వెంటనే మహిళలకు ప్రతినెలా రూ. 2500, ఎకరాకు రూ. 15వేల రైతు భరో సా, ఆసరా పింఛన్ల పెంపు, రైతులకు రుణమాఫీ తదితర హామీలను నెరవేర్చాలన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి నిరుద్యోగుల కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గుబ్లాకుల వేలంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాన్ని రచ్చబండ వేదికగా ఎండగడతామని స్పష్టం చేశా రు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నాయకత్వంలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. తెలంగాణ సాధనకు జైలుకు వెళ్లి కేసుల పాలైన విషయాన్ని గుర్తు చేశారు. తన హయాంలో రామగుండంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయిం చి ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేర్చానని చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ పూర్వవైభవం కోసం నాయకులు, కార్యకర్త లు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పీటీ స్వామి, నడిపెల్లి మురళీధర్‌రావు, ఆముల నారాయణ, కార్పొరేటర్లు కన్నూరి సతీశ్‌కుమార్, కల్వచర్ల క్రిష్ణవేణి, బాదె అంజలి, అడ్డాల గట్టయ్య, జనగామ కవిత సరోజనీ, నేతలు జేవీ రాజు, పర్లపల్లి రవి, మాదాసు రామమూర్తి, జహీద్‌పాషా, రాకం వేణు, నారాయణదాసు మారుతి, కౌటం బాబు, చల్లగురుల మొగిలి, పిల్లి రమేశ్, బొడ్డు రవీందర్, తిరుపతి, బొడ్డుపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

ఫోన్ పేలో మనీ పంపించానని చూపించి..

రూ.10 వేలతో ఉడాయింపు

అనుమానిత వ్యక్తి

జగిత్యాల, జూలై 14 : ఫోన్ పేలో డబ్బులు పంపించానని మెసేజ్ చూపించి రూ.10 వేల నగదు తీసుకుని ఉడాయించిన ఘటన జగిత్యాల పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం గుర్తు తెలియని వ్యక్తి నంబర్ ప్లేట్ లేని బైక్‌పై ఒక బట్టల షాపులోకి వచ్చి మూడు చీరెలు కొనుగోలు చేశాడు. చీరెల విలువ రూ.2200 కాగా, తన వద్ద నగదు లేకపోవడంతో ఫోన్‌పే ద్వారా చెల్లిస్తానని చెప్పాడు. అలాగే, తనకు అత్యవసరంగా డబ్బులు కావాలని మొత్తం రూ.10 వేలు అడిగాడు. దీంతో సదరు షాపు యజమానురాలు స్కానర్ చూపించగా, అది పనిచేయడం లేదని, ఇంకొక నంబర్ చెప్పమని అడిగాడు. ఆమె తన భర్త నంబర్‌ను ఇవ్వగా, వెంటనే అతడు రూ.10 వేలు ఫోన్ పే ద్వారా ట్రాన్జాక్షన్ అయినట్టు ఫేక్ మెసేజ్ చూపించి, ఆమె వద్ద మూడు చీరెలతో పాటు రూ.7800 నగదు తీసుకొని ఉడాయించాడు. జరిగిన మోసాన్ని భార్యాభర్తలు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేశారు. కాగా, మోసపూరిత వ్యక్తులను దృష్టి లో పెట్టుకొని ప్రజ లు జాగ్రత్తగా ఉండాలని పట్టణ పోలీసులు కోరారు.

ఆపరేటర్ల ఇష్టారాజ్యం?

భూముల రిజిస్ట్రేషన్లలో అడ్డగోలు దోపిడీ



- ధరణిలో స్లాట్ బుక్ చేసుకునే వారికి చుక్కలు
- తహసీల్దార్లకు సైతం దడ పుట్టిస్తున్న వైనం
- జగిత్యాల నియోజకవర్గంలో శ్రుతిమించిన ఒకరి తీరు
- అందరికీ హెడ్‌గా జగిత్యాలలో మరో వ్యక్తి
- కీలక సూత్రధారి వెనుకాల బడా అధికారులు
- రూ.లక్షలు దాటి రూ.కోట్లకు చేరుతున్న వ్యవహారం
- ఆపరేటర్ల బదిలీకి అధికారుల నిర్ణయం
- నేడో రేపో ఉత్తర్వులు జారీ
- బదిలీల్లోనూ చక్రం తిప్పుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

"జగిత్యాల నియోజకవర్గంలోని ఒక మండల తహసీల్ కార్యాలయం అది. ప్రజా సంబంధాలు నిర్వహించే వృత్తిలో ఉన్న ఒక వ్యక్తి తన స్నేహితుడి వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం అక్కడికి వెళ్లాడు. తాము స్లాట్ బుక్ చేసుకున్నామని, రిజిస్ట్రేషన్ ఉందని అధికారికి చెప్పాడు. దీంతో అతడు ఆపరేటర్‌ను పిలిచి రిజిస్ట్రేషన్ వ్యవహారం చూడాలని సూచించగా, సదరు ఆపరేటర్ అన్ని పత్రాలు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయరాదని తేల్చి చెప్పాడు. అన్ని రికార్డులు ఉన్నాయి.. అమ్మినవారు, కొన్నవారు ఇద్దరూ ఉన్నారు.. ఎందుకు రిజిస్ట్రేషన్ చేయరాదు.. అని ప్రశ్నిస్తే.. లింక్ డాక్యుమెంట్ లేదు.. అని బదులిచ్చాడు. అదేంటి రెండు లింక్ డాక్యుమెంట్లు ఉన్నాయి కదా..! ఎందుకు చేయరాదు.. అంటే.. భూమిని ఇప్పటి వరకు ఎనిమిది మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.. విక్రయించారు.. మీ వద్ద మూడు లింక్ డాక్యుమెంట్లు మాత్రమే ఉన్నాయి.. అంతకు ముందటి నాలుగు లింక్ డాక్యుమెంట్లు తెస్తేనే రిజిస్ట్రేషన్ కుదురుతుందని తేల్చిచెప్పాడు.. దీంతో ఆపరేటర్ సమాధానం విన్న ప్రజా సంబంధాలు నిర్వహించే వృత్తిలో ఉన్న వ్యక్తి ఆశ్చర్యపోయాడు. చివరకు ఆపరేటర్‌ను ప్రైవేట్‌గా వెళ్లి కలిస్తే.. అందరికీ రూ.30వేలు తీసుకుంటాం అన్నా.. మీరు ప్రజా సంబంధ వృత్తిలో ఉన్నారు కదా.. రూ.15వేలు ఇవ్వండి అని చెప్పడంతో అతను అడిగినన్ని డబ్బులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకొని బతుకుజీవుడా.. అని బయటపడ్డారు."

"చొప్పదండి నియోజకవర్గంలోని ఓ మండల తహసీల్దార్ ఆపరేటర్ వ్యవహారం మరింత వివాదస్పదంగా మారింది.. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వ్యక్తి భూ రికార్డులు సరిగానే ఉన్నా.. లేవని చెప్పాడు. రూ.30వేలు ఇస్తేనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని ఆపరేటర్ తేల్చిచెప్పడంతో గత్యంతరం లేని పరిస్థితిలో అడిగిన డబ్బులు ఇచ్చి భూ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు.. అయితే, ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న సదరు బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు.. ఇవి మచ్చుకు ఒకటి, రెండు మాత్రమే. ఇలాంటివి వందల్లో ఉన్నాయి అంటున్నారు బాధితులు.

రెవెన్యూ శాఖలో విస్తరించిన అవినీతి, దశారుల వ్యవస్థను తొలిగించి లంచగొండి తనం లేని వ్యవస్థను సృష్టించాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక సదుద్దేశంతో ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చారు. అంతే కాకుండా భూ రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా, సులభంగా, వేగంగా అయ్యేలా విజయవంతంగా అమలు చేశారు. అయితే, కొందరు ఆపరేటర్లు చేతివాటం ప్రదర్శిస్తూ.. అందినకాడికి దండుకుంటూ ధరణి వ్యవస్థకే మాయని మచ్చ తెస్తున్నారు. జగిత్యాల జిల్లాలోని పలు మండలాలకు చెందిన పలువురు ఆపరేటర్ల లంచాలు, వారి దోపిడీ చర్చనీయాంశంగా మారిపోయింది. ఒకటి కాదు.. రెండు కాదు నిత్యం వారిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

– జగిత్యాల రూరల్, జూలై 14

అంతా వారి చేతిలోనే..

వ్యవసాయ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లన్నీ తహసీల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రిజిస్ట్రేషన్లు వేగంగా, పారదర్శకంగా చేయడం, వెంటనే మ్యుటేషన్ చేయాలన్న సంకల్పంతో తహసీల్దార్లకు ఈ బాధ్యతలను అప్పగించారు. ఈ ప్రక్రియ నిర్వహించేది తహసీల్దార్లే అయినా.. వాస్తవికంగా అన్ని కార్యక్రమాలు ఆపరేటర్లే చేయాల్సిన పరిస్థితి. ధరణి పోర్టల్ ప్రారంభమైన తర్వాత ప్రతి తహసీల్ కార్యాలయంలో ధరణి కంప్యూటర్ ఆపరేటర్లను రూ.8వేల వేతనంతో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. భూమి రిజిస్ట్రేషన్, విరాసత్, పార్టీషన్, తదితర వాటి కోసం ముందుగా మీ సేవలో స్లాట్ బుక్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్ డేట్ ఇస్తారు. ఎవరెవరికి స్లాట్ బుక్ అయ్యిందన్న వివరాలు ధరణి ఆపరేటర్లకే తెలుస్తాయి. రిజిస్ట్రేషన్ కోసం సమయం పొందిన వ్యక్తులు తహసీల్ ఆఫీస్‌కు వెళ్లి ముందుగా రిజిస్ట్రేషన్ వ్యవహారం, స్లాట్ బుకింగ్ అంశాన్ని ధరణి ఆపరేటర్లతో ప్రస్తావించాల్సి ఉంటుంది. స్లాట్ ఓకే అయిందని తెలుసుకున్న తర్వాత తహసీల్దార్లను కలిసి పత్రాలన్నింటినీ చూపించాలి. అధికారి ఆమోదం తర్వాత ఆపరేటర్లకు ఇచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను తహసీల్దార్ పూర్తి చేస్తారు. తర్వాత మ్యుటేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం పత్రాలను కొనుగోలు, విక్రయదారులకు అందిస్తారు. అయితే, ఈ వ్యవహారంలో ఆపరేటర్లదే కీలక పాత్ర. స్లాట్ ఓకే అయిందా? లేదా? అన్నప్పటి నుంచే ఆపరేటర్లు తమ మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. వీలైనంత వరకు స్లాట్ బుకింగ్ కాలేదని బెదిరిస్తున్నారు. ఎందుకు కాలేదు.. అంటే.. రికార్డులు సరిగా లేవని చెబుతున్నారు. రికార్డులన్నీ సరి చేసి రిజిస్ట్రేషన్ చేయాలంటే ఖర్చవుతుందని బెదిరిస్తున్నారు. విధి లేని పరిస్థితుల్లో చాలా మంది ఆపరేటర్ల ధన దాహానికి బలి అవుతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా మ్యుటేషన్ పేపర్లు రావడం లేదని, మూడు నాలుగు రోజుల తర్వాత వచ్చి తీసుకుపోవాలంటూ కొర్రీలు పెడుతున్నారు. వారు సంపాదించడంతోపాటు అధికారులందరికీ ఇవ్వాల్సి ఉంటుంది అంటూ వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు.

ఫిర్యాదులే.. ఫిర్యాదులు

ఆపరేటర్ల ఆగడాలు శ్రుతిమించడంతో అటు బాధితులు, ఇటు ప్రజాప్రతినిధులు వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జగిత్యాల నియోజకవర్గంలోని ఒక మండలంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఇటీవలే పార్టీ మారిన ఒక ప్రజాప్రతినిధికి దగ్గరి బంధువు కావడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు సమాచారం. సదరు ఆపరేటర్ మూడేండ్ల వ్యవధిలో రూ.కోట్లు సంపాదించాడనే ఆరోపణలున్నాయి. ప్రజాప్రతినిధి బంధువు అన్న ధీమాతో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతోపాటు, కార్యాలయాన్ని అసాంఘిక కార్యకలాపాలకు సైతం వేదికగా మార్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఒకటి రెండు సార్లు అధికారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రయత్నించగా సదరు ఆపరేటర్ ప్రజాప్రతినిధి వద్దకు వెళ్లి విషయం చెప్పగా, ''మా బావ కొడుకుపై మీరెలా ఫిర్యాదు చేస్తారు'' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో వారు సైతం కిక్కురుమనకుండా ఉన్నట్లు తెలుస్తోంది. చొప్పదండి నియోజకవర్గంలోని ఆపరేటర్‌పై లంచాలతోపాటు ఇతర అనేక ఆరోపణలు వచ్చాయి. విధిలేని పరిస్థితుల్లో సదరు ఆపరేటర్‌ను మరో చోటికి మార్చారు. కోరుట్ల నియోజకవర్గంలోని మరో ఆపరేటర్ వ్యవహారశైలి సైతం తీవ్ర విమర్శలకు దారి తీసింది. కాగా, నాలుగు రోజుల క్రితం ఓ తహసీల్దార్ ధైర్యం చేసి ఆపరేటర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, సదరు ఆపరేటర్‌ను జిల్లా కేంద్రానికి తాత్కాలికంగా అటాచ్డ్ చేసినట్లు సమాచారం.

బాట్ సోర్సింగ్ ఉద్యోగే కీలకం

ఆపరేటర్లకు సంబంధించిన వ్యవహారం మొత్తంలో జగిత్యాలలోని ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగే కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం ప్రతి మండలానికి ఒక ఆపరేటర్, జిల్లా కేంద్రానికి ఒక కో ఆర్డినేటర్‌ను నియమించారు. అలాగే, జిల్లా కేంద్రంలో ఒక ఆపరేటర్‌ను బఫర్ ఆపరేటర్‌గా ఏర్పాటు చేశారు. ఈ వ్యక్తి ఎవరైనా మండల ఆపరేటర్‌కు వ్యక్తిగత ఇబ్బంది, సెలవు, అనారోగ్యం ఉన్న సమయంలో ఆ మండలానికి వెళ్లి డ్యూటీ నిర్వహించాల్సి ఉంటుంది. కాగా, ఆపరేటర్లను కో-ఆర్డినేట్ చేసేందుకు జిల్లా కోఆర్డినేటర్ ఉన్నప్పటికీ అతడిని పక్కకు నెట్టి మరో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చక్రం తిప్పుతున్నట్లు తెలిసింది. జిల్లాలోని ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలో కంప్యూటర్ హార్డ్‌వేర్ చూసేందుకు నియమించిన ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగి డిప్యూటేషన్ పేరుతో జిల్లా కేంద్రంలో తిష్టవేసినట్లు సమాచారం. అంతే కాదు, పెద్ద తిమింగళంలా మారి ఆపరేటర్లపై అధికారం చెలాయించడంతోపాటు మండలాల నుంచి వచ్చే రెవెన్యూ వ్యవహారాలను సైతం చక్కబెట్టి పెద్దఎత్తున సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఉన్నతాధికారులకు సైతం వాటా ఉన్నట్లు జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులే చర్చించుకోవడం విశేషం. సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి ధరణి ఆపరేటర్ల విభాగానికి వాస్తవికంగా సంబంధం లేదు. ధరణికి సంబంధించిన వివరాలు అన్నీ ధరణి జిల్లా కో-ఆర్డినేటర్ నిర్వహించాలి. ఉన్నతాధికారి వద్దకు వెళ్లి ఆయన వేలిముద్ర తీసుకోవడంతోపాటు, ధరణి వివరాలు తెలియజేయాలి. అయితే జిల్లాలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతున్నట్లు సమాచారం. ధరణి జిల్లా కో-ఆర్డినేటర్‌ను పక్కన పడేసి కంప్యూటర్ హార్డ్‌వేర్‌గా విధులు నిర్వర్తించాల్సిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కో-ఆర్డినేటర్ బాధ్యతలు అనధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కంప్యూటర్ ఆపరేటర్ అంటూ జిల్లా కీలక అధికారులకు దగ్గర కావడం, వారి ప్రాపకం సంపాదించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఆపరేటర్లపై వచ్చే ఆరోపణలన్నింటినీ ఉన్నతాధికారులు సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి చెబుతుండడం, దాన్ని ఆసరాగా చేసుకొని సదరు ఉద్యోగి ఆపరేటర్ల వద్ద పెద్ద ఎత్తున డబ్బులు గుంజుతున్నట్లు తెలుస్తోంది.

బదిలీల్లోనూ చక్రం తిప్పుతున్న వైనం

ఆపరేటర్లకు సంబంధించిన అనేక అవకతవకలు బయటికి రావడం.. వ్యవహారశైలి వివాదాస్పదం కావడంతో వారిని జిల్లా వ్యాప్తంగా బదిలీ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తమకు నచ్చిన మండలంలో పోస్టింగ్ కోసం ఆపరేటర్లు లాబీయింగ్ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వద్దకు వచ్చిన ఆపరేటర్లు తమకు మంచి ప్లేసులు, ఆదాయం వచ్చే మండలాలు ఇవ్వాలని కోరగా, రూ.2లక్షల నుంచి రూ.3లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. కొత్తగా వచ్చిన అధికారి తనకు క్లోజ్ అయ్యారని, మీరేం భయపడకండి.. అన్నీ తాను చూసుకుంటానని అంటూ అభయం ఇచ్చి అప్పుడే పని మొదలు పెట్టినట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆపరేటర్లకు సంబంధించిన పోస్టింగ్ జాబితాను సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి స్వయంగా తయారు చేసి ఉన్నతాధికారికి నివేదించినట్లు సమాచారం. తనకు నచ్చిన వారిని, నచ్చిన మండలానికి కేటాయిస్తూ రూపొందించిన జాబితా ఈరోజో.. రేపో ఆమోదం పొందేలా ఉండడం చూసి ఉన్నతాధికారులు సైతం తలపట్టుకుంటున్నట్లు తెలిసింది. కాగా, ఈ విషయమై సంబంధిత శాఖ అధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందన కరువైంది.

అర్చక బదిలీలకు బ్రేక్!

- రాజన్న ఆలయ అర్చకులకు ఆది శ్రీనివాస్ భరోసా
- 'నమస్తే' కథనానికి స్పందన

వేములవాడ, జూలై 14: రాజన్న ఆలయ అర్చక బదిలీలకు బ్రేక్ పడనున్నది. ఈ మేరకు తనను కలిసిన అర్చకులకు వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రెండు రోజుల క్రితం 'నమస్తేతెలంగాణ'లో అనధికార అర్చక బదిలీలు శీర్షికన కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆది శ్రీనివాస్ స్పందించారు. ఆదివారం రాజన్న ఆలయ అర్చకులు ఆది శ్రీనివాస్‌ను వేములవాడలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనం చేశారు. అనంతరం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనంపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వివిధ ఆలయాల సాంప్రదాయాల ప్రకారం పూజా విధానాలు ఉంటాయని వివరించి బదిలీ నిర్ణయాన్ని వెనక్కుతీసుకునే లా చూడాలని విజ్ఞప్తిచేశారు. దీంతో ఆయన రాష్ట్రంలోని దేవాలయ పరిధిలో ఉన్న శాసనసభ్యులందరం కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అర్చకుల బదిలీలు ఉండబోవని ఆయన హామీఇచ్చినట్లు వారు తెలిపారు. పరిపాలనపరమైన ఉద్యోగుల విషయంలో మాత్రం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలసీల్లో భాగంగా 40 శాతం ఉద్యోగుల బదిలీ తప్పనిసరిగా ఉంటుందని చెప్పారు. ఆయన్ను కలిసినవారిలో రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు సిరిగిరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి ఆశీర్వచనం అందజేస్తున్న రాజన్న ఆలయ అర్చకులు

విభజన రాజకీయాలకు కాలం చెల్లింది

ఎల్ఐసీ యూనియన్ మహాసభల్లో జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

మాట్లాడుతున్న ఏఐఐఈ జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

కరీంనగర్ విద్యానగర్, జూలై 14: దేశప్రజలను మతప్రాతిపదికగా విభజించి ఓట్లు దండుకొనే రాజకీయాలకు కాలం చెల్లిందని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జోనల్ ప్రధాన కార్యదర్శి టీవీఎన్ఎస్ రవీంద్రనాథ్ అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎల్ఐసీలోని అతిపెద్ద యూనియన్ ఏఐఐఈఏ కరీంనగర్ డివిజన్ 28వ మహాసభలను ఆదివారం నగరంలోని పద్మనాయక కల్యాణమండపంలో నిర్వహించారు. రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోడీ మతాన్ని అడ్డంపెట్టుకొని ఓట్లడిగి దేశప్రతిష్టను దిగజార్చారని మండిపడ్డారు. చైతన్యవంతులైన ప్రజలు 400 సీట్లను ఆశించిన బీజేపీని 240 సీట్లకే పరిమితం చేశారని చెప్పారు. బలమైన ప్రతిపక్షంతో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం బలపడుతుందని అభిప్రాయపడ్డారు. సర్కారు సహకారం లేకున్నా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఎల్ఐసీ అద్భుతమైన ప్రగతిని సాధించి మార్కెట్ లీడర్‌గా తన సుస్థిరం చేసుకున్నదని చెప్పారు. ఈ సమావేశానికి అతిథులుగా యూనియన్ జోనల్ అధ్యక్షులు పీ సతీశ్, సంయుక్త కార్యదర్శి జీ తిరుపతయ్య, కోశాధికారి శ్రీనివాసన్, సికింద్రాబాద్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి రఘు హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా ఎల్ఐసీ క్లాస్ 1 అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ సత్యనారాయణ, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ సంఘ నాయకులు వాసుదేవారెడ్డి, ఏజెంట్ యూనియన్ నుంచి గట్టు రాజయ్య, రైతు సంఘం నుంచి వాసుదేవారెడ్డి, సీఐటీయూ నాయకులతో పాటు పూర్వపు కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి 13 ఎల్ఐసీ బ్రాంచ్‌లకు చెందిన 200 మంది సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు

'నమస్తే' కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు

వెంకంపల్లిలో మరమ్మతు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

గంగాధర, జూలై 14: గంగాధర మండలంలోని వివిధ గ్రామాల్లో 20 రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మ ర్లు కాలిపోయి రైతులు ఇబ్బంది పడుతున్న విషయ మై 'నమస్తే తెలంగాణ'లో 'ట్రాన్స్ ఫార్మర్ల సమస్య పట్టదా?' అనే శీర్షికన ప్రచు రితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మండలంలోని నాగిరెడ్డిపూర్, న్యాలకొండన్నపల్లి